## క్లుప్తంగా

### 19న విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సదస్సు

**జి.మాడుగుల:** పాడేరు ఏపీఈపీడీఎల్ పరిధిలోని చింతపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 19న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు జి.మాడుగుల మండల విద్యుత్ శాఖ ఏఈ రమణ తెలిపారు.విద్యుత్ వినియోగదార్లందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అయన కోరారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు, ఇబ్బందులు సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశానికి సీజీ ఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర్య సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్‌లు హాజరవుతారని ఆయన తెలిపారు.

### ఉపాధ్యాయుడికి పాడేరు ఎమ్మెల్యే పరామర్శ



పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబును పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

**సాక్షి, పాడేరు:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు కొండపల్లి రాంబాబును పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం రాత్రి పరామర్శించారు. బైక్ నుంచి పడి గాయాలు పాలవడంతో ఆదివారం రాత్రి రాంబాబును పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు వైద్య సేవలు పొందుతున్న ఉపాధ్యాయుడిని ఎమ్మెల్యే ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శించి మెరుగైన వైద్య సేవలు కల్పించాలని వైద్యులను ఆదేశించారు.

### నేడు నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

**బుచ్చెయ్యపేట:** వడ్డాది మేజర్ పంచాయతీలో వెలిసిన ఉమాగౌరీ నీలకంఠేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసవర్మ, సోమేష్‌కుమార్ తెలిపారు. పురాతన కాలం నాటి శివాలయంలో స్వామివారి కల్యాణాన్ని ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాత్రి ఏడున్నర గంటలకు ఇక్కడ మండపంలో నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో శర్మ, ఆలయ సిబ్బంది కోరారు.

### ఘనంగా ఫాదర్స్ డే



వేడుకలో మాట్లాడుతున్న పాస్టర్ సంజీవ్‌కుమార్

**అరకులోయ రూరల్:** మండలంలో బెంజిపూర్ లూథరన్ మిషన్ క్రైస్తవ చర్చిలో పాస్టర్ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు తమ తండ్రులను దేవునితో సమానంగా కొలవాలన్నారు. మంచి మార్గంను నడిచేందుకు చిన్నతనం నుంచి అలవర్చుకోవాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు, అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. చర్చిలో సందడి వాతావరణం నెలకొంది.

### తాగునీటి కల్పనకు ప్రత్యేక చర్యలు



బోరు పనులను ప్రారంభించిన ఎంపీపీ ఉషారాణి

**అరకులోయ రూరల్:** మండలంలో మాడగడ పంచాయతీ గతనగుడ గ్రామంలో ఆదివారం మండల పరిషత్ నిధులతో రూ.1.50లక్షల వ్యయంతో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి బోరు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన బోర్లు ఎన్నికల నేపథ్యంలో పనులు జరగలేదన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో విస్తృతంగా బోరు ఏర్పాటు పనులు చేస్తున్నామన్నారు. తాగునీరు లేని ప్రతి గ్రామంలో సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నర్సింహమూర్తి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మన్యసీమలో మత్స్యసిరులు



వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో చేపలవేటలో మత్స్యకారులు

- జలాశయాల్లో మొదలైన వేట
- మరింత ప్రభుత్వ ప్రోత్సాహం కావాలంటున్న మత్స్యకార సంఘాలు
- చేపల పెంపకంతో గిరిజనులకు ఉపాధి అవకాశం

**రాజవొమ్మంగి:** మండలవ్యాప్తంగా గల మైనర్ ఇరిగేషన్ సాగునీటి చెరువులు, జలాశయాల్లో చేపల పెంపకం చేపడుతున్న గిరిజన మత్స్యకార సంఘాల పంట పండుతోంది. రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో చేపల వేటను గ్రామస్తులు ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేపపిల్లలతో పాటు తాము కూడా సొంతంగా చేపపిల్లలు కొనుగోలు చేసి ఈ రిజర్వాయర్‌లో పెంచుతున్నామని మత్స్యకార సంఘ సభ్యులు నూకరాజు, పోతురాజు, సోమరాజు తదితరులు చెబుతున్నారు. మత్స్యకార సంఘాలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇస్తే చేపల పెంపకంలో సిరులు పండిస్తామని ఈ గ్రామంలో నివసించే గిరిజన రైతులు అంటున్నారు. అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో దాదాపు 200 ఎకరాల గర్భం (క్యాచ్‌మెంట్ ఏరియా) గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో ఏటా దాదాపు రూ.2 లక్ష విలువైన ఫింగర్‌లింగ్స్‌తో పాటు రొయ్య విత్తనాలు కూడా వేస్తున్నామన్నారు. అయితే ఈ చెరువు గర్భంలోని చెట్లను తొలగించకపోవడంతో నాచు చెట్ల కొమ్మలు(మోళ్లు) చేపల వలలకు తగిలి, అవి తరిగిపోతుండటంతో నష్టం కలుగజేస్తున్నాయన్నారు. చెరువులోని మోళ్లు తొలగించి, పూడిక తీత చేపడితే ఇటు చేపల పెంపకానికి, మరోవైపు దాదాపు మూడు ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు కూడా సక్రమంగా లభిస్తుందన్నారు.

ప్రతి ఏటా రిజర్వాయర్‌లో గడ్డి చేపపిల్లలు, బిగ్‌బాస్, రోహు, కట్ల, బంగారుతీగ (చైనా చేప) తదితర రకరకాల రెండు లక్షలకు పైగా చేపపిల్లలను వేస్తున్నామన్నారు. గత ఏడాది, అంతకు ముందు సంవత్సరం వేసిన చేపపిల్లను నేడు రెండు కిలోల నుంచి 5 కిలోల బరువు తూగుతున్నాయన్నారు. వరి తదితర పంటల కాలం ముగిసి పోయి వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే చేపల వేట మొదలు పెట్టామన్నారు.

**పలు గ్రామాల్లో చేపల పెంపకం**

మండలంలో దాదాపు చిన్న పెద్ద వందకు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. ముఖ్యంగా గింజర్తి, కింద్ర, కొత్తకింద్ర, లబ్బర్తి, సింగంపల్లి, దూసరపాము తదితర గ్రామాల్లో వున్న పెద్ద పెద్ద చెరువుల్లో మత్స్యకార సంఘాల సభ్యులు చేపల పెంపకం చేపడుతున్నారు. ప్రధాన స్లూయిజ్ నుంచి చేపలు తప్పించుకొని పంటకాలులోకి, రిజర్వాయర్ నుంచి సర్‌ప్లస్ వియర్‌లోకి వెళ్లిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా ఒక్కోసారి అధిక వర్షాలు వస్తే వరదపోటుకు తాము ఏడాది పొడవునా పెంచుకొన్న చేపలు దిగువకుపోవడంతో నష్టం చవి చూస్తున్నామని సభ్యులు తెలిపారు. చేపలు పట్టేందుకు, వాటిని మార్కెట్‌కు తరలించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పద్ధతులను అందుబాటులోకి తీసుకొని రావాలని కోరుతున్నారు. పడవలు, వలలు, మోపెడ్లు, తూకం సామగ్రి ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని కోరారు. చేపల పెంపకం పెరిగితే ఉపాధి అవకాశాలతో పాటు గ్రామాల్లో పౌష్టికాహారలోపాలు కూడా తగ్గుముఖం పడతాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.



వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో లభించిన చేపలతో స్థానికుడు (ఫైల్)

**సబ్సిడీపై చేప పిల్లలు**

అని మత్స్యశాఖ రంపచోడవరం ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.రమేష్ అన్నారు. ప్రభుత్వం వ్యక్తిగత చెరువులు వున్న రైతులకు, అలాగే సాగునీటి వనరుల్లో చేపలు పెంచేందుకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై చేపపిల్లలు అందజేస్తోందన్నారు.

# హుకుంపేటలో మోదకొండమ్మ జాతర ప్రారంభం



అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులతో పాటు సీఐ నాయుడు, సర్పంచ్ వెంకటపూర్ణిమ్మ తదితరులు

**హుకుంపేట :** మండల కేంద్రం హుకుంపేటలో ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవలు మొదటి రోజు మొదలైంది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీఐ పన్యాసినాయుడు, సర్పంచ్ సమిడి వెంకటపూర్ణిమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ అమ్మవారి ఘటాలు మోస్తు డప్పు వాయిద్యాలతో శతకంపట్టు వరకు ఊరేగించారు. భక్తులు ప్రత్యేకంగా అమ్మవారిని పట్టు వస్త్రలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో చాటుకున్నారు. మండల కేంద్రం ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఎవరి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకార్యలు ఏర్పాటు చేశారు. మోదకొండమ్మ అమ్మవారి పండుగకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు 62 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు నిర్వహించిన్నట్టు సీఐ సన్యాసినాయుడు చెప్పారు.



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

# ఆత్మీయ సన్మానాలు



అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు, నాయకులు



ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, శివరత్నం దంపతులను సన్మానిస్తున్న కిల్లంకోట గిరిజనులు

**సాక్షి,పాడేరు:** అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి, చెట్టి వినయ్ దంపతులను ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాడేరులోని ఎంపీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే పెదబయలు ఎంపీపీ బొండా వరహాలమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జర్సింగి గంగాభవానీ, కొంటా సూర్యనారాయణ, కృష్ణారావు, ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు, సర్పంచ్‌లు వెంగడ రమేష్, మండి బాబూరావు, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, నాయకులు సన్యాసిరావు, రాజారావు, ప్రసాద్, రామరాజు తదితరులు కూడా ఎంపీ దంపతులను ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజవొమ్మంగి ఎంపీపీ వెంకటలక్ష్మి, నాయకులు

**సాక్షి, పాడేరు:** పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జి.కే.వీధి జెడ్పీటీసీ శివరత్నం దంపతులకు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన జి.మాడుగుల మండలం కిల్లంకోట గ్రామానికి చెందిన గిరిజనులు, కుటుంబ సభ్యులు ఆదివారం పాడేరు చేరుకుని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దంపతులకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. అలాగే రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి ఎంపీపీ గోమ వెంకటలక్ష్మి, వెంకటేశ్వరరాజు, ఎంపీటీసీ సభ్యుడు కనిగిరి వీరబాబు, సర్పంచ్ దుర్గాప్రసాద్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిపి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**మారేడుమిల్లి :** మండలంలోని బోదులూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడకు చెందిన శ్రీకాంత్ (19) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు...కాకినాడకు చెందిన శేషన్, శ్రీకాంత్ అనే ఇద్దరు యువకులు రాజమహేంద్రవరంలోని గైట్ కాలేజీలో బీటెక్ చదువుతున్నారు. వీరు బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి వై.రామరంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతరం అక్కడ నుంచి ఆదివారం మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసె హిల్ స్టేషన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం, బోదులూరుకు సమీపంలో మారేడుమిల్లి నుంచి పాతకోట వైపుగా వెళ్తున్న మరొక బైకు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్ర గాయాలయ్యాయి.



శ్రీకాంత్ మృతదేహం

అతనికి బోదులూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి, పరిస్థితి విషమంగా ఉండడంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రీకాంత్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

**చింతపల్లిరూరల్:** విద్యుత్‌షాక్‌తో ఓ లైన్‌మెన్ తీవ్రంగా గాయపడ్డాడు. గూడెంకొత్తవీధి మండలం సంకాడ కొత్తురులో మరమ్మతు పనుల కోసం ఆదివారం లైన్‌మెన్ పోతురాజు బాలకృష్ణ స్తంభం ఎక్కాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ ఉద్యోగి విద్యుత్ సరఫరా ఆన్ చేయడంతో షాక్‌గురై బాలకృష్ణ స్తంభం పై నుంచి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి సిబ్బంది హుటాహుటిన చింతపల్లి ఆస్పత్రికి తరలించగా, డాక్టర్ చందనశ్రీ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి రిఫర్ చేశారు.



గాయపడిన లైన్‌మెన్ బాలకృష్ణ

## 20 నుంచి షటిల్ టోర్నమెంట్

**రంపచోడవరం:** అల్లూరి సీతారామరాజు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఠాగూర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్, బుల్లిదొర మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నట్టు నిర్వహకులు నాగేంద్రకుమార్, వై.సురేష్‌రెడ్డి, సీహెచ్.అభిషేక్ తెలిపారు. ఏజెన్సీ మండలాలకు చెందిన నాన్ మెడలిస్ట్ క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. టోర్నమెంట్ కేవలం పురుషులకు మాత్రమే అని పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9014229091, 6303049191కు సంప్రదించాలని కోరారు.

# సిరులు కురిపిస్తున్న వైట్‌బర్లీ పొగాకు

- ఏడాది పొడవునా సాగు
- ఆశాజనకంగా ధరలు



పక్వానికి వచ్చిన పొగాకును బేళ్లుగా కట్టి కొనుగోలు కేంద్రానికి తరలించిన దృశ్యం



రాజవొమ్మంగిలో పొగాకు తోట

**రాజవొమ్మంగి:** వైట్‌బర్లీ పొగాకు పంట ఏజెన్సీ రైతులకు సిరులు కురిపిస్తోంది. ఏడాదిలో రెండు పంటలు వేసి రైతులు అధికంగా ఈ పంటపైనే ఆధారపడుతున్నారు. గతంలో కేవలం వర్షాధారంగానే పొగాకు సాగు చేసేవారు. కాగా నేడు వేసవిపంటగా (తడుపుపొగాకు) కూడా విరివిగా సాగుచేస్తున్నారు. అత్యధిక లాభాలు చేతికి వస్తుండటంతో ఈ పంటపైనే రైతులు మొగ్గుచూపుతున్నారు. మన్యంలో పండిన పొగాకుకు మాత్రమే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకి ఉండడంతో పలు కంపెనీలు ఈ సాగులో రైతులను ప్రోత్సహిస్తున్నాయి. వైట్‌బర్లీ పొగాకును సిగరెట్ల తయారీలో ఉపయోగిస్తారు. ప్రముఖ కంపెనీ ఐటీసీ మన్యంలోని పొగాకు కొనుగోళ్లకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి, అమీనాబాద్, జెడ్డంగి అన్నవరం, కింద్ర, లబ్బర్తి, లాగరాయి, శరభవరం, చికిలింత, కరుదేవపాలెం, వంచంగి తదితర గ్రామాల్లో ఈ వైట్ బర్లీ సాగు బాగా పెరిగింది. మండలంలోని గ్రామాలతో పాటు కొయ్యూరు మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో బర్లీ సాగవుతోంది. క్వింటా ధర రూ.11,000 పలుకుతోంది. ఎకరాకు 600 కిలోల నుంచి 1000 కిలోల (టన్ను) వరకు దిగుబడిని సాధిస్తున్న రైతన్న ఇంతర వాణిజ్య పంటలను వదిలి ఈ పంటపైనే దష్టి సారిస్తున్నాడు. మిగతా పంటలమాదిరిగా పొగాకు తోటల పెంపకంలో పశువులు, కోతులు, ఇతర అడవి జంతువుల బెడద తక్కువ, ఆకులు చేదుగా వుండటంతో మేకలు గొర్రెలు ఈ పంటజోలికి పోవు. మొక్క నాటింది మొదలు చీడపీడల నివారణపై కాస్త దష్టి సారిస్తే పొగాకు పంట సాగు చేయడం ఎంతో సులువని రైతాంగం భావిస్తోంది.

**పండిన పంటకు మార్కెట్**

పండిన (పక్వానికి వచ్చిన) పొగాకు ఆకులను బేళ్లుగా తయారు చేసి స్థానికంగానే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. పొగాకు అమ్మిన 24 గంటల్లోనే రైతు చేతికి సొమ్ములు వస్తుండడంతో ఈ పంటే మేలని రైతులు భావిస్తున్నారు. మూడు నెలల సమయంలోనే పొగాకు పంట చేతికి వస్తుంది. ఎకరాకు సుమారు రూ. 70 వేల నుంచి 90 వేల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి దాదాపు రూ.20వేలు పోగా మిగిలిదంతా ఆదాయమే కనుక చిన్న సన్నకారు రైతాంగం ఈ పంటపైనే ఆధారపడుతుండడం విశేషం.

## గిడ్డి ఈశ్వరి తీరుపై ధ్వజం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నూకాలు, ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ రాజులమ్మ

**కొయ్యూరు:** ఏ హోదాతో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అధికారికంగా నిర్వహించిన విత్తనాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు ప్రశ్నించారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈశ్వరి ఎమ్మెల్యే కాదు..అలా అని ఎమ్మెల్సీ కూడా కాదు... ఏహోదా లేని ఆమె రైతులకు విత్తనాల పంపిణీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆమెకు ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రావడం లేదన్నారు.ఒక మాజీ ఎమ్మెల్యేకు ప్రోటోకాల్ ఎలా వర్తిస్తుందో చెప్పాలని ధ్వజమెత్తారు. ఇకపై తీరు మార్చుకోవాలని చెప్పారు.

## ముగిసిన క్రికెట్ టోర్నీ

**చింతపల్లిరూరల్:** మండలంలో తాజంగిలోని పెటియ సత్తిబాబు జ్ఞాపకార్థంగా నిర్వాహకులు కౌషిక్, సురేంద్ర, సాగర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బ్లాక్ స్క్వాడ్ టీమ్, సూపర్ స్ట్రైకర్స్ టీమ్ తలపడగా బ్లాక్ స్క్వాడ్ టీమ్ విజేతగా నిలిచింది. వారికి సర్పంచ్ మహేశ్వరి, గ్రామ పెద్దలు లింగన్నబాబు, చోక్కాకుల రమణ, మాజీ సర్పంచ్ పెనుముల కాంతమ్మ, మహమ్మద్ చేతుల మీదుగా మొదటి బహుమతిగా రూ.10వేలు అందించారు. రన్నర్‌గా నిలిచిన సూపర్ స్ట్రైకర్స్‌కు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సత్తిబాబుకు క్రికెట్ క్రీడపై ఆయనకు మక్కువను గుర్తించి టోర్నమెంట్ నిర్వహించినట్టు చెప్పారు. తాజంగిలో శాశ్వత క్రికెట్ మైదానం కోసం గ్రామ పెద్దలు, ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. గ్రామస్తులు పాల్గొన్నారు.



టోర్నీలో మొదటి బహుమతి గెలుచుకున్న బ్లాక్ స్క్వాడ్ టీమ్

## అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

- లభ్యం కాని మృతుడి వివరాలు
- పూర్తయిన పోస్టుమార్టం
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మృతదేహం

**కొయ్యూరు:** సింగవరం ఐటీడీఏ కాలనీ సమీపంలో శనివారం గుర్తు తెలియని ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు స్పందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరిలించారు. మృతుడి వివరాలు తెలియలేదని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదైనట్టు చెప్పారు. పలు ప్రాంతాలకు సిబ్బందిని పంపి మృతుడి గురించి ఆరా తీస్తున్నామన్నారు. అదే విధంగా ఇతర స్టేషన్ల నుంచి అదృశ్యమైన కేసులపై ఆరా తీస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఉన్నట్టు చెప్పారు.

## అపరాల సాగుకు వరుణుడి దెబ్బ

**రోలుగుంట:** మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలతో అపరాల పంట దెబ్బ తింటోంది. పూత దశలో ఉన్న పెసర, మినుము పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో స్వల్పకాలిక రకాలైన మినుము, పెసర, బొబ్బర తదితర అపరాల పంటలను అడ్డసరం, శరభవరం, పాపంపేట, రోలుగుంట, వడ్డిప తదితర గ్రామాల్లో విస్తారంగా సాగు చేపట్టారు. పంటలు పచ్చగానే పూత దశలో ఉన్నాయి. అయితే గత వారం ఎండల తీవ్రతకు పంటలు వడలి పోగా గురు, శుక్రవారాలు కురిసిన భారీ వర్షాలకు తేరుకున్నా... భూమి ఇవకెత్తడంతో కుళ్లిపోతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ పంట భూమిలో నీటిని వెంటనే పైకిపోయే మార్గం చేసుకుని సంరక్షించుకోవాలని సూచించారు.



వడ్డిపలో నీటిలో పెసర పంట